క్లుప్తంగా

విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వండి



తెనాలిఅర్బన్: విద్యతో పాటు క్రీడలకు అధిన ప్రాధాన్య ఇవ్వాల్సిన అవసరం ఉందని సెయింట్ జాన్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ సూరజ్ మోహన్ పేర్కొన్నారు. నాజర్‌పేటలోని సెయింట్ జాన్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో శనివారం ఏర్పాటు చేసిన రన్నింగ్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల జీవన విధానంలో చాలా మార్పులు వచ్చాయని తెలిపారు. నిత్యం వివిధ పనులతో బీజీగా ఉంటూ ఆరోగ్యంపై ఎక్కువ మంది దృష్టి పెట్టలేకపోతున్నారని చెప్పారు. ప్రతి రోజు వ్యాయామం చేయడం వలన ఆరోగ్యంగా ఉంటారన్నారు. తమ పాఠశాలలో విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం 2కె, 5కె, 10కె రన్‌లలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అనీ అరుణలత, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ



తెనాలిరూరల్: మండలంలోని కొలకలూరు గ్రామలలో గల పీహెచ్‌సీని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ శ్రవణ్ బాబు శనివారం తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో వ్యాక్సిన్ నిల్వ చేసే డీప్ ఫ్రిజర్. ఐస్‌లైన్డ్ రిఫ్రిజిరేటర్(ఐఎల్ఆర్)లోని వ్యాక్సిన్‌లను పరిశీలించారు. అలానే కొలకలూరు ఉపకేంద్రాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. వ్యాధి నిరోధక టీకాలు పుట్టిన వెంటనే ఆరు వారాల నుంచి ఐదేళ్ల వరకు ఏ విధంగా వేయాలి, ఏ వ్యాధులు రాకుండా పిల్లలను కాపాడవచ్చు వంటి అంశాలపై ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలకు వివరించారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సీహెచ్‌వీ సుబ్బారావు ఉన్నారు.

అక్రమ కట్టడాలు కూల్చివేత



తెనాలిఅర్బన్: పట్టణంలో అక్రమ భవన నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా కొత్తపేటలో అనుమతులు లేకుండా నిర్మించిన శ్లాబ్‌ను శనివారం పగులు కొట్టారు. టీపీవో సాంబశివరావు కథనం ప్రకారం.. కొత్తపేట టౌన్‌చర్చి సమీపంలో ఓ స్థల యాజమని గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు రెండు ఫ్లోర్‌లు నిర్మించుకునేందుకు మున్సిపాలిటీ నుంచి అనుమతులు తీసుకున్నాడు. అతడు ఇటీవల మూడో అంతస్తును నిర్మించారు. విషయం తెలుసుకున్న అసిస్టెంట్ సీటీ ప్లానర్ శివన్నారాయణ నేతృత్వంలో టీపీవో సాంబశివరావు తన సిబ్బందితో అక్కడకు చేరుకుని శ్లాబ్‌కు మూడు చోట్ల రంధ్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీపీవో సాంబశివరావు మాట్లాడుతూ తెనాలి పట్టణంలో గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు మూడు ఫ్లోర్‌లకు మున్సిపాలిటీ అనుమతులు ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు 'గుళ్లపల్లి'

33వ వర్ధంతి సభలో పలువురు విద్యావేత్తలు



తెనాలి: పట్టణంలోని శ్రీఅరవింద ఎడ్యుకేషన్ సొసైటీ, శ్రీఅరవింద విద్యాకేంద్రం వ్యవస్థాపకుడు గుళ్లపల్లి సత్యనారాయణ 33వ వర్ధంతిని శనివారం స్థానిక నాజరుపేటలోని శ్రీఅరవింద విద్యాకేంద్రం ఆవరణలో ఘనంగా నిర్వహించారు. తొలుత శ్రీమాతారవిందుల ధ్యానమందిరంలో పుష్పాలను సమర్పించి, సామూహిక ధ్యానం చేశారు. సత్యనారాయణ చిత్రపటానికి డాక్టర్ అనూష తాడిబోయిన జ్యోతి ప్రజ్వలన చేశారు. విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామరాజు, వై.విద్యాశంకర్, సయ్యద్ బాషా, విద్యాకేంద్రం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు సత్యనారాయణకు నివాళులర్పించారు. విద్యాకేంద్రం చిన్నారులు 'తాతగారికి వందనం' నృత్యరూపకాన్ని అభినయించారు. ఇదే వేదికపై శ్రీఅరవింద ఎడ్యుకేషన్ సొసైటీ సంయుక్త కార్యదర్శి కొడాలి సుదర్శనబాబు, విద్యాకేంద్రం స్థాపనలో ప్రముఖపాత్ర వహించిన కొసరాజు పద్మారాణి (యూఎస్) సంస్మరణ సభను నిర్వహించారు. సభకు విద్యాకేంద్రం డైరెక్టర్ కె.సంపూర్ణ అధ్యక్షత వహించారు. సుదర్శనబాబు, పద్మారాణి విద్యా కేంద్రానికి అందించిన సేవలను వివరించారు.

విజయవంతంగా కూరల సేంద్రియ సాగు

- ఎనిమిది సంవత్సరాల నుంచి విజయవంతంగా కొనసాగుతున్న కేంద్రం
- పండిన కూరగాయలు, ఆకు కూరలు అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ

తెనాలిఅర్బన్: తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సేంద్రియ కూరగాయల సాగు కేంద్రం విజయవంతంగా కొనసాగుతోంది. ఎటువంటి పురుగు మందు, ఎరువులు వాడకుండా కేవలం సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, ఆకుకూరలు పండిస్తూ శభాష్ అనిపిస్తున్నారు. పంట దిగుబడి కూడా పెరగటంతో వచ్చిన కూరగాయలు, ఆకుకూరలను ఉచితంగా అంగన్‌వాడీ కేంద్రాలు పంపిణీ చేస్తు వారి మన్ననలను పొందుతున్నారు. తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో అమరావతి ప్లాట్స్‌లోని 50 సెంట్ల స్థలంలో 2016లో సేంద్రియ కూరగాయల సాగు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దానిలో అరటి, వంగ, టమోటా, మిర్చి, బెండ, ములగకాయ, బీర, సొర వంటి కూరగాయలు (దేశవాళీ రకం, హైబ్రీడ్ రకం) సాగును చేపట్టారు. అలాగే పాలకూర, చుక్కకూర, గోంగోర వంటి వాటిని పండిస్తున్నారు. ప్రతిరోజు మొక్కల వద్ద బాగు చేయటం, వాటికి సకాలంలో నీరును అందించటం వంటివి చేస్తున్నారు.



తెనాలిలో ఏర్పాటు చేసిన సేంద్రియ కూరగాయల సాగు కేంద్రం

సేంద్రియ పద్ధతిలో సాగు

కేంద్రంలోని మొక్కలకు ఎటువంటి పురుగు మందులు వాడకుండా పూర్తిగా సేంద్రియ పద్ధతిలో వాటిని పండిస్తున్నారు. అలాగే వేపాకు, ఉమ్మెత్తాకు, మారేడాకు, జిల్లెడ ఆకు, గానుగసూనెతో కలిపి ఆవు మూత్రంలో నానబెడతారు. దాని నుంచి వచ్చిన కషాయాన్ని మొక్కలకు స్ప్రే చేస్తారు. దీనివల్ల మొక్కలకు తెగుళ్ళు సోకే అవకాశం ఉండదు. అలాగే ఆకు కూరలకు సంబంధించిన మడులు వేసి వాటికి నీళ్ళు పెట్టడం చేస్తారు. అవసరమైతే నల్లమట్టిని పోసి దిగుబడి బాగా వచ్చే విధంగా చూస్తారు. దీనికి కూడా ఎటువంటి రసాయనాలు, పురుగు మందులు వాడకుండా పూర్తిగా సేంద్రియ పద్ధతిలో పండిస్తున్నారు.

10 అంగన్‌వాడీ కేంద్రాలకు కూరగాయలు పంపిణీ

సేంద్రియ ద్ధతిలో పండించిన కూరగాయలు, ఆకుకూరలను పట్టణంలోని 10 అంగన్‌వాడీ కేంద్రాలకు ఉచితంగా మున్సిపల్ అధికారులు పంపిణీ చేస్తున్నారు. ప్రతిరోజు వండుకోవడానికి అనువుగా ఉన్న వాటిని అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహకులకు అందిస్తుంటారు. ప్రతిరోజు ఏ సెంటర్‌కు ఎలాంటి కూరగాయలు, ఆకు కూరలు అందించారనేది కూడా రికార్డులో నమోదు చేసి నిర్వాహకులతో సంతకం చేయిస్తుంటారు. అంతేకాకుండా చెట్లకు పండిన అరటికాయలు, ములగకాయలు, జామకాయలను కూడా వారికి పంపిణీ చేస్తుంటారు. ఇలా సుమారు ఆరు నెలల వరకు పంపిణీ చేస్తారు. పంట దిగుబడులు తగ్గిపోగానే వాటిని తీసి వేసి వాటి స్థానంలో నూతన మొక్కలు నాటుతున్నారు.

అలాగే ఆకుకూరల విత్తనాలను వేసి మరలా వాటి సంరక్షణ చేస్తుంటారు. మొత్తం మీద తెనాలిలో ఏర్పాటు చేసిన కూరగాయల సాగు కేంద్రం అంగన్ వాడీలలో ఉండే బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు మంచి పౌష్టికాహారాన్ని అందిస్తుందనే చెప్పవచ్చు.



కేంద్రంలో ఏర్పాటు చేసిన వివిధ రకాల మొక్కలు



కేంద్రంలోని బెండ సాగు

సేంద్రియ పద్ధతిలో పండిస్తున్నాం



2016లో తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, ఆకుకూరల సాగు చేపట్టాం. వీటి దిగుబడిని పెంచేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టాం. వచ్చిన దిగుబడిని అంగన్‌వాడీ కేంద్రాలకు ఉచితంగా పంపిణీ చేస్తున్నాం. ఎటువంటి కలుషితం లేని కూరగాయలు, ఆకుకూరలను పండిస్తున్నాం. దిగుబడులు కూడా బాగా వస్తున్నాయి.

–శిఖపల్లి శేషుబాబు, ఉద్యానశాఖాధికారి, తెనాలి పురపాలక సంఘం.

ప్రభుత్వాదేశాలు అమలయ్యేలా చూడండి

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాశం వెంకటేష్ డిమాండ్

తెనాలిఅర్బన్: ప్రభుత్వ ఆదేశాలను ప్రవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు పాటించే విధంగా చూడాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాశం వెంకటేష్ డిమాండ్ చేశారు. శనివారం తరగతులు నిర్వహిస్తున్న పట్టణంలోని పలు విద్యాసంస్థల వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ర్యాంకుల పేరుతో విద్యార్థులను మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నారని ఆరోపించారు. సెలవు దినాల్లో విద్యాసంస్థలను నిర్వహిస్తున్న యాజమాన్యలపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు ఉన్నతాధికారులను కోరిన ఇప్పటి వరకు ఆ దిశగా జరగలేదన్నారు. ప్రభుత్వ అధికారులు దాటవేత ధోరణితో వ్యవహించడం వలన ప్రవేట్ విద్యాసంస్థల నిర్వాహకులు తమ ఇష్టానుసరంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సెలవు రోజుల్లో తరగతులు నిర్వహించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుండు శివ, తెనాలి నియోజకవర్గ కార్యదర్శి చెనూరి సాయి, ఉపాధ్యక్షుడు దినేష్, నాయకులు సన్నీ, జయదీప్, పండు, ప్రభాస్, అఖిల్, హేమంత్, జయరామ్, తదితరులు పాల్గొన్నారు.



తరగతులు నిర్వహిస్తున్న ఓ ప్రవేట్ స్కూల్‌లో ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

తెనాలిలో బయోపిక్ తాజా షెడ్యూలు షూటింగ్

- బాబు జగజీవన్ రామ్ బయోపిక్ తాజా షెడ్యూల్ ప్రారంభం
- భగత్‌సింగ్, చంద్రశేఖర్ అజాద్ పాత్రల్లో ఇద్దరు ఎమ్మెల్యేలు

తెనాలి: స్థానిక రత్న ఫార్చ్యూన్ కళ్యాణ మండపం ఆవరణలో బాబూ జగజ్జీవన్‌రామ్ చలనచిత్రం రెండో షెడ్యూలు రెగ్యులర్ షూటింగ్ శనివారం ఉదయం ప్రారంభమైంది. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే జి.రామాంజనేయులు, పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు కేసన శంకరరావు పాల్గొని వివిధ సన్నివేశాలకు నటీనటులపై క్లాప్ కొట్టారు. టైటిల్ పాత్ర బాబు జగజ్జీవన్‌రామ్ పాత్రలో మిలటరీ ప్రసాద్, భగత్ సింగ్ గా ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు, చంద్రశేఖర్ ఆజాద్‌గా పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర నటిస్తున్నట్లు దర్శకుడు దిలీప్‌రాజా వెల్లడించారు. సాయంత్రం వీరిపై కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. తొలుత నరసింహరాజు, కావ్యకీర్తిపై సన్నివేశాన్ని తీయగా, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు క్లాప్‌కొట్టారు. వీరితోపాటు బి వెంకట స్వామి నాయుడు, అరవిందరాజా నటిస్తున్నారని, దర్శకుడు దిలీప్‌రాజా సాయంత్రం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. తాజా షెడ్యూలులో బాబు జగజ్జీవన్‌రామ్ స్వాతంత్ర ఉద్యమంలో పోషించిన పాత్ర, రాజకీయ నేపథ్యం వంటి స్ఫూర్తిదాయకమైన అంశాలను తెరకెక్కిస్తున్నట్లు తెలిపారు. జగజ్జీవన్‌రామ్ బయోపిక్‌లో ఆరుగురు ఎమ్మెల్యేలు నటిస్తున్నారని, షూటింగ్ నిరవధికంగా కొనసాగుతుందని వివరించారు. చిత్రానికి డీఓపీగా మురళీకృష్ణ, కెమెరామెన్ వంశీ, ఆర్ట్ డైరెక్టర్ రత్నాకర్ కనపర్తి, ప్రొడక్షన్ ఇన్చార్జి శ్రీకాంత్, మేకప్ జనార్దన్, లైటింగ్ మణి, ప్రొడక్షన్ షేక్ హాజీ, పి.రమేష్ వ్యవహరిస్తున్నట్లు వివరించారు.



జగజ్జీవన్‌రామ్, భగత్‌సింగ్, నేతాజీ పాత్రధారులపై క్లాప్‌నిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

16న విజయవాడలో ఎమ్మార్పీఎస్ సభ

జిల్లా అధ్యక్షుడు కిన్నెర నాగరాజు మాదిగ

తెనాలి: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ ఆదేశాలతో ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి 30 వసంతాలైన సందర్భంగా ఈనెల 16వ తేదీన విజయవాడలో జరగనున్న సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కిన్నెర నాగరాజు మాదిగ కోరారు. పట్టణ గంగానమ్మపేట కార్యాలయంలో శనివారం సంబంధిత కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. మాదిగ ప్రజల ఉన్నతికై అమరులైనజాతి ముద్దుబిడ్డలను స్మరించుకుని, తొలితరం నాయకత్వాన్ని గౌరవించుకొని, వారి అనుభవాలు, సలహాలను పంచుకుంటూ భవిష్యత్ కార్యాచరణ నిర్మించుకొనే ఉద్దేశంతో విజయవాడ సభ జరుగుతుందని తెలిపారు. విజయవాడ గాంధీనగర్‌లోని ఫిలిం చాంబర్‌లో ఆరోజు ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సభకు జిల్లాలోని ముఖ్యనాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు. జిల్లా ఇన్‌చార్జి కొమరాల శ్రీనివాస్ మాదిగ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు త్వరగా అసెంబ్లీలో తీర్మానాలు చేసి వర్గీకరణను అమలు చేయాలని కోరారు. ముందుగా ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు తీర్మానం చేయాన్నారు. ప్రైవేటు రంగంలోనూ వర్గీకరణను అమలుచేయాలని, అప్పటివరకు డీఎస్సీ, ఇతర ప్రభుత్వ ఉద్యోగ నియామకాలను వాయిదా వేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర నాయకులు ఏటుకూరు విజయ్‌కుమార్ మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి వలేటి భూషణం మాదిగ, గుంటూరు రూరల్ అధ్యక్షుడు సిద్దేల ఇశ్రాయేలు మాదిగ, గద్దం బుజ్జిబాబుమాదిగ, సురేష్ మాదిగ, రవి మాదిగ, శ్రీను మాదిగ, రమణమూర్తి మాదిగ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరించిన కిన్నెర నాగరాజు మాదిగ

మద్యం బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్ట్

కొల్లూరు(వేమూరు): మద్యం బెల్టు షాపు నిర్వాహకుడిని అరెస్ట్ చేసామని ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొల్లూరు మండలంలోని జువ్వలపాలెం గ్రామానికి చెందిన బెల్టుషాపు నిర్వాహకుడు మద్యం బాటిల్ విక్రయిస్తుండగా పట్టుకోవడం జరిగిందన్నారు. అతని వద్ద 8 మద్యం బాటిల్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.

రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటుకు రాయితీ

- ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలి
- కేంద్రం విద్యుత్ వినియోగదారులకు రాయితీపై సోలార్
- విద్యుత్ మండల ఏఈ ప్రదీప్‌కుమార్

కొల్లిపర: విద్యుత్ బిల్లులు తగ్గించుకునేందుకు వినియోగదారులు తమ ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసుకునేందుకు కేంద్రప్రభుత్వం రాయితీని ఇస్తుందని, దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యుత్ శాఖ ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. శనివారం మండల విద్యుత్ కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా ఈ రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటు చేసుకునేందుకు ఒక కిలోవాట్ సామర్థ్యంకు రూ.30 వేలు, రెండు కిలోవాట్స్ సామర్థ్యంకు రూ.60వేలు, మూడో కిలో వాట్స్ సామర్థ్యంకు రూ.78 వేలు చొప్పున ప్రభుత్వం రాయితీ అందిస్తుందని తెలిపారు. ఎక్కువగా విద్యుత్ వినియోగించేవారు ఈ సోలార్ విధానం ద్వారా విద్యుత్ ఆదా చేయటంతో పాటు విద్యుత్ బిల్లు బారీగా తగ్గుతుందన్నారు. గత నెలలో మండలంలో తొలిసారిగా వల్లభాపురం గ్రామంలో గుంటక వెంకటేశ్వరరెడ్డి విద్యుత్ వినియోగదారునికి మూడో కిలోవాట్స్ సామర్థ్యంతో కలిగిన ఇంక్రీమస్ సోలార్ వారు జెముడుబాడు గ్రామానికి చెందిన సోలార్ టెక్నీషియన్ వింతా శివనాగిరెడ్డి బింగించారు. ఈ సోలార్ విధానం సెక్సెస్ కావటంతో ప్రస్తుతం కొల్లిపర లో మరొకరికి ఏర్పాటు చేయడానికి సిద్ధ పడుతున్నారు. ఎవరికైనా అనుమానాలు ఉంటే విద్యుత్ అధికారులను లేదా ఇప్పటికే సోలార్ ఏర్పాటు చేసిన వారి ఇంటికి వెళ్లి పరిశీలించి వారికి ఉన్న అపోహలు విడనాడి ప్రతి ఒక్కరూ ఏర్పాటు చేసుకోవాలని కోరుచున్నాము.ఈ కార్యక్రమంలో శంకర ప్రసాద్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

నాసరయ్య జీవితం నేటితరానికి ఆదర్శం

- శతజయంతి సభలో ప్రత్తిపాడు, పార్వతీపురం ఎమ్మెల్యేలు రామాంజనేయులు, బోనెల విజయచంద్ర
- 'సాంఘిక నాటక జైత్రయాత్ర కన్నెగంటి నాసరయ్య' పుస్తకావిష్కరణ

తెనాలి: స్వాతంత్ర్య ఉద్యమంలో భాగస్వామిగా ఉంటూనే సాంఘిక నాటక వైభవానికి కృషిచేసిన నాటక రంగ ప్రముఖుడు కన్నెగంటి నాసరయ్య స్ఫూర్తి నేటితరానికి అవసరమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే జి.రామాంజనేయులు అభిప్రాయపడ్డారు. కళల తెనాలిలో జన్మించి, బుర్రకథా రూపంలో స్వాతంత్ర్య పోరాటానికి ఊపిరిలూది, సాంఘిక నాటకం దేదీప్యమానంగా వెలుగొందేలా జీవితకాలం కృషిచేసిన నాసరయ్య చరితార్థులని చెప్పారు. ఆయన జీవితం నేటితరానికి ఆదర్శం కావాలన్నారు. పట్టణానికి చెందిన ప్రముఖ రంగస్థల కళాకారుడు, నటశిక్షకుడు జనతా ఆర్ట్ థియేటర్ వ్యవస్థాపకుడు కన్నెగంటి నాసరయ్య శతజయంతి సభను శనివారం మధ్యాహ్నం పట్టణ ఆలపాటినగర్‌లోని రత్నా ఫార్చ్యూన్ కళ్యాణ మండపంలో నిర్వహించారు. మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ కన్నెగంటి గోపీచంద్ అధ్యక్షత వహించారు.

పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మాట్లాడుతూ జానపద కళలకు ప్రసిద్ధి చెందిన ఉత్తరాంధ్రలోనూ నాసరయ్య స్ఫూర్తి ఉందన్నారు. నాసరయ్య చెప్పిన బుర్రకథలను ఇప్పటికీ స్మరించుకుంటారని చెప్పారు. ఆ కళా ప్రముఖుడు శతజయంతి సభలో పాల్గొనడం తన అదృష్టంగా చెప్పారు. దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య గుజ్జర్లమూడి కృపా చారి మాట్లాడుతూ యుక్త వయసులోనే బుర్రకథతో ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిన నాసరయ్య ఎందరినో స్వాతంత్ర ఉద్యమం వైపు నడిపించారని చెప్పారు. తర్వాత జనతా ఆర్ట్ థియేటర్ నాటక సమాజంతో సాంఘిక నాటకాలను ప్రదర్శించారని చెప్పారు. సాంఘిక నాటకంలో అనేక ప్రయోగాత్మక పద్ధతులను ప్రవేశపెట్టి ఆదరణను పెంచారని తెలిపారు.

నాడు ఉజ్వలంగా వెలిగిన పౌరాణిక పద్య నాటకాలకు దీటుగా సాంఘిక నాటకాన్ని తీర్చిదిద్దారని వివరించారు. ప్రముఖ న్యాయవాది పొన్నం విజయ్ కుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమ రోజుల్లో బ్రిటిష్ పోలీసులకు వ్యతిరేకంగా అర్ధరాత్రి పెట్రోమాక్స్ లైట్ల వెలుగులో రహస్యంగా బుర్రకథలు చెప్పిన నాసరయ్య ధైర్యం గొప్పదన్నారు. తొలుత నాసరయ్య జీవితంపై 'సాక్షి' విలేకరి బీఎల్ నారాయణ రాసిన 'సాంఘిక నాటక జైత్రయాత్ర కన్నెగంటి నాసరయ్య' పుస్తకాన్ని ఎమ్మెల్యేలు రామాంజనేయులు, విజయచంద్రా ఆవిష్కరించారు.

సభలో సినీదర్శకుడు దిలీప్‌రాజా, సినీనటులు నరసింహరాజు, కావ్య, పట్టణ రంగస్థల కళాకారుల సంఘం కార్యదర్శి గరికపాటి సుబ్బారావు, రంగస్థల/ సినీనటులు డెయిరీ ప్రసాద్, వేమూరి విజయభాస్కర్, పందిటి సుబ్బారావు, బెజ్జంకి నాగమణి, సంగీత దర్శకుడు బొల్లిముంత కృష్ణ, కళాదర్శకుడు కనపర్తి రత్నాకర్, న్యాయవాది దంతాల కిరణ్ మాట్లాడారు. కన్నెగంటి మధు, తన్నీరు శివశంకర్ పర్యవేక్షించారు.



పుస్తకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యేలు రామాంజనేయులు, బోనెల విజయచంద్ర

పోలీసుల అదుపులో లిక్విడ్ గంజాయి విక్రేతలు!

గుంటూరు రూరల్: లిక్విడ్ గంజాయి విక్రేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఇటీవల నగరంలోని పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి బ్యాచ్ పోలీసులకు పట్టుబడిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తీగలాగితే డొంక కదిలినట్లు పోలీసుల విచారణలో స్వర్ణభారతీనగర్‌కు చెందిన యువతి, యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. అక్రమార్కులకు విద్యార్థులే టార్గెట్‌గా చేసుకున్నారు. గంజాయిని నేరుగా విక్రయిస్తే వాసనకు అందరికి తెలుస్తుందని గమనించిన అక్రమార్కులు గంజాయిని తెచ్చి దానితో లిక్విడ్‌ను తయారు చేసి చిన్నచిన్న బాటిల్స్‌తో విక్రయాలు చేస్తున్నట్లు సమాచారం.

మద్యం విక్రేత అరెస్ట్

రేపల్లె రూరల్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ఘటన మండలంలోని గంగడిపాలెంలో చోటుచేసుకుంది. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ దివాకర్ వివరాల మేరకు తమకు అందిన సమాచారంతో గ్రామంలో దాడులు నిర్వహించగా గ్రామానికి చెందిన లంకె కృష్ణమోహన్ గ్రామంలోని రామాలయం వద్ద మద్యం విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. కృష్ణమోహన్ నుంచి 15 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు

అర్హత ఉన్న వారికి ఉచిత న్యాయసహాయం



తెనాలిరూరల్: జాతీయ న్యాయ సేవల అధికార దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అంగలకుదురు బీసీ బాలికల వసతి గృహంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ప్రిన్సిపల్ సివిల్ జడ్జ్ (జూనియర్ డివిజన్) ఎ. పవన్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జాతీయ న్యాయ సేవలు చట్టం 1987 నవంబర్ 9తేదీ 1995 నుంచి అమల్లోకి వచ్చిందని ఆయన తెలిపారు. సమాజంలో పేద ధనిక తారతమ్యం లేకుండా అందరికీ సమాన న్యాయం అందించాలనేది ఈ చట్టం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ఎవరికైనా న్యాయ సహాయం అవసరం అయినపుడు టోల్ ఫ్రీ నెంబర్ 15100కు కాల్ చేస్తే అర్హత ఉన్న వారికి ఉచిత న్యాయ సహాయం అందుతుందన్నారు. అలాగే మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీని సంప్రదించవచ్చని సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, పారా లీగల్ వాలంటీర్ అనిల్ కుమార్, మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ పర్యవేక్షుడు షేక్ మహబూబ్, వసతి గృహం సంక్షేమ అధికారిణి సరోజిని, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం

కొల్లిపర: మండల వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు జి.సిద్ధార్థ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఏగ్రామంలోనైనా కొత్తగా ఓట్లు నమోదు చేసుకొనే వారు, మార్పులు, చేర్పులు చేసుకొనే ఓటర్లు ఆయా గ్రామాలలోని పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్ఓలు అందుబాటులో ఉంటారని వారికి అర్జీలు అందించాలని కోరారు. అలాగే ఈనెల 23 , 24న కూడా ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ఉంటుందన్నారు.ఈ అవకాశాన్ని మండలంలోని 19 సంవత్సరాలు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ వంశీకృష్ణ, ఎలక్షన్ కంప్యూటర్ ఆ పరేటర్ ఈమని సురేంద్రారెడ్డి, వీఆర్‌వోలు, బీఎల్ఓలు, తదితరులు పాల్గొన్నారు.

యాంబియంట్ టెక్నో స్కూల్లో ఫుడ్ ఫెస్టివల్



తెనాలిఅర్బన్: చెంచుపేటలోని యాంబియంట్ టక్నో స్కూల్‌లో శనివారం ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్ ఫర్ పేరెంట్స్ కార్యక్రమాన్ని స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ షేక్ ఇర్షాద్ ప్రారంభించారు. విద్యార్థుల తల్లులు తయారు చేసి తీసుకువచ్చిన వంటకాలను ఆయన పరిశీలించి రుచి చూచారు. అత్యధిక పోషక విలువలు ఉన్న వంటకాలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ షేక్ సల్మా, ప్రిన్సిపల్ వై.లక్ష్మీప్రసన్న, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

15న ధరల భారంపై సీపీఎం ధర్నా



తెనాలి: బియ్యం, పప్పులు, నూనెల ధరలు తగ్గించకపోగా కరెంటు చార్జీల భారం వేస్తున్న ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఈనెల 15వ తేదీన స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నారు. ఈ ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎన్.భావన్నారాయణ కోరారు. ధరల పెరుగుదలతో పార్టీ చేపట్టిన 'ప్రజాపోరు'లో భాగంగా పట్టణ పాండురంగపేటలో నిత్యావసరాల ధరల పెరుగుదల, కరెంటు చార్జీల భారంపై ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. భావన్నారాయణ మాట్లాడుతూ, కేంద్రప్రభుత్వం ప్రజాసమస్యలను పక్కదారి పట్టించేందుకు జమిలీ ఎన్నికలు అంటోందనీ విమర్శించారు.